# కాళ్ళా వేళ్ళా పడిన వేయి కళ్ళవాడు

అది ఒక పుణ్యాశ్రమం. మిధిలకు వెళ్ళే దారిలో ఉంది. అక్కడ ఎప్పుడూ గౌతమ సూత్రాలు వినబడుతూ ఉంటాయి. అది మహర్షి గౌతముల ఆశ్రమం. ఆయన సామాన్యుడు కాడు. మాన్యుడు. సమ్మాన్యుడు. అంతే కాదు ఆయన సాక్షాత్తు బ్రహ్మ అల్లుడు. ఆ బ్రహ్మ కూతురు అల్లాటి ఇల్లాటి అమ్మాయి కాదు. అందగత్తెలలో అందగత్తె.

అసలదెలా జరిగిందంటే -

ఒక రోజు స్వర్గంలో తగాదా వచ్చింది. అందరిలోకి అందెగత్తె ఎవరూ అని, అప్పుడు వరుణుడు దేవేంద్రుడితో ఊర్వశి అందగత్తె అన్నాడు. అప్పుడేమో ఇంద్రుడు ఆ మాట నిజమనేశాడు. అంటే కుబేరుడి కుమారుడు నలకూబరుడు అడ్డొచ్చి అదేం కాదు. రంభే చాలా అందగత్తె అందుకే నారీష రంభ అనే సూక్తి పుట్టింది అన్నాడు. దాంతో ఒకరు ప్రమోచనూ, మహర్షి విభాండకుడు ఋష్య శృంగుని తండ్రి హరిణిని, ఇంకొకరు ఘృతాచిని మరొకరు తారను, హేమ, మదాలసను పొగిడి పేర్కొన్నారు.

ఆపై విశ్వామిత్రుడు

కన్నులు చేరలం గొలవ గాదగు గొనర పేద చన్నులా
కిన్నెర కాయలం గెలుచు కీల్జెడ బారకు మీరు మోముక
పున్నమ చందమామ యొకె పోలిక వాలిక తూపు చూపు నా
కన్నుల యాన దాని కెనగాన జగాన మొగాన పల్కెదన్

అని మేనక ప్రశంస చేశాడు.

దాంతో చర్చ షూటెక్కి వ్యాసుడు దాశకన్య అంద చందాలు వాయుపు అంజనీదేవి దారు సౌభాగ్యాలు అలా గలభా రేగి ఎవరి కిష్టమైన స్త్రీ పేర్లు వాళ్ళు చెప్పు సాగారు.

ఈ గోలంతా ఎందుకని ఇంద్రుడు అందర్నీ కూడగట్టుకొని సాక్షాత్తూ సృష్టికర్త వద్దకే జగడం తీర్చమని వెళ్ళాడు. ఆయన అంతా విని ఒక్కొక్కరికి ఒక్కో లోపం చెప్పి అవేవి లేని అంగనామణిని మదిరాక్షిని సృష్టిస్తానని చెప్పి.

కుదురై ఒప్పుల కుప్పయై గోరంత నొచ్చంబులే నిదియై
నొవ్వని జవ్వనంబు గలదై నిద్దంపు టొయ్యారియై
మదనోజ్జీ వినియై గరాగరికయై మాణిక్య పుంబొమ్మయౌ

మదిరాక్షిన్ సృజియింతు – అని పంతం పట్టి సృష్టించి ఇచ్చిన సుందరాంగి అహల్య. ఆమెను చూచి అచ్చరలంతా తబ్బిబ్బయ్యారు. దేవతలంతా క[illegible] డ్డారు. మునుల మనస్సు చెదిరింది.

అయితే ఇంద్రుడి దృష్టి ఆమెమీద పడింది. ఆమె అతడితో చూపు చూపూ కలిపింది. దాంతో అతడు పేట్రేగి నరుల్లో కిన్నెరుల్లో కింపురుషుల్లో సిద్ధసాధ్యుల్లో ఋషుల్లో ఈమెకు తగినవాడు ఎవరూ లేరు. దేవతల్లోనేనే తగినవాడ్ని. ఆమెనిచ్చి పెండ్లి చేయి అని అడిగాడు. దానికి బ్రహ్మ పకపక నవ్వి నిన్నే పొగడుకోవడం తగదోయ్ ఇంద్రా! నాకు అల్లుడు కాదగినవాడు. అహల్యకు భర్త కాదగినవాడు గౌతముడు అని అప్పటికప్పుడు అహల్యను గౌతముడికిచ్చి పెళ్ళి చేశాడు.

అహల్యా గౌతములు అడవిలో కాపురం పెట్టారు. అలా ఉండగా ఒక రోజు గౌతముడు ఇంట్లో లేని వేళ చూసుకొని వచ్చి ఆశ్రమంలో జొరబడి పాకశాసనుడు ఆ పూరి పాక ముందు నిలబడి ప్రశ్నించాడు. అహల్య పలికింది.

మాటా మాటా సాగితే సిగ్గు ననేగి నవ్వుచున్ అయితే ఇంద్రుడికి లోపలికి రావడానికి సాహసం చాల్లేదు. ఆపై ఒక జగజంత రాయభారం చేసింది. దాంతో ఓ రాత్రి కాచి వేచి వీలు చూసుకొని లోపల చొరబడ్డాడు అదీ గౌతముడి వేషంలో.

అహల్యకు వచ్చింది ఇంద్రుడని తెలీదూ ? ఏమో !

వేకువ స్నానానికి వెళ్ళిన మొగుడు (మగడు) అంతలోనే ఇంట్లోకి వస్తే మగడో మగడి రూపంలో ఉన్న ఇంద్రుడో తెలీదా ? ఏమో ! ఏమైతేనేం అహల్య మేను పులకించేలా జీవితానందం పొందింది. ఏరూపంలో నైతేనేం ఇంద్రుడి కోరిక తీరింది. అంతకు ముందు ఇద్దరి మధ్య పసందైన సంభాషణ జరుగుతుంది.

దాంతో ఆమె నవ్వుతూ నా మగని వేషభాషల నేమిటికి ధరించివచ్చి తెరుంగ జెపుదూ అంటే నీ మగని రూప మౌటకు పై మాటలు నశపంటె పంకజ గంధీ అంటాడు ఇంద్రుడు నిజానికి ఈ మాటలలో కంటే అంతకు ముందు మాటల్లోనే గడుస్తనాలున్నాయి.

దేవా ! శచీ మనోరమణా ! అంటుందామె ఆమె మనస్సుని శరీరాన్ని ఆనందింప చేసే వాడివి అంటూ నర్మగర్భంగా అంటే ఇంద్రుడు అంటాడు. నీదు శోభా విభవం చూడ్డానికి వచ్చానంటాడు. ఇదెంతో అర్థం ఇముడ్చుకొన్న మాటకదా ! తర్వాత వనితా నవమన్మధా ! అని సంబోధిస్తుంది.

దానికి భావజునాన అంటాడు. మన్మధుడి ఆజ్ఞతో అని అర్థం. మన్మధుడి ఆజ్ఞగా మన్మధ తంత్రానికి వచ్చానని ధ్వనించాడు ఇంద్రుడు. ఆమె చాలు చాలు ఇక వెళ్ళు ఈ మాటలు చాలించి వెళ్ళు అంటే ఇంద్రుడు. కాళ్ళా వేళ్ళ పడ్డాడు.

బెట్టు తగ్గకుండా ఒప్ప ఒప్పనట్టు ఒప్పుకుంటుందా ఒప్పుల కుప్ప ఆమె నియమాలన్నింటికీ గతి లేక అంగీకరిస్తాడు ఇంద్రుడు.

తరువాత ఇంద్రుడు మహేంద్రానందాన్ని అనుభవిస్తాడు. అపై తెల్ల వార బోతుందని వెళ్ళలేక వెళ్లలేక సెలవడిగితే అతన్ని విడవలేక విడవలేక అంటుంది.

నమ్మిన దాన నా తనువు నమ్మిన దానను నీకు ఇంక నే
నమ్మక చెల్ల ! నన్ను విరహాగ్నికి బాల్పడ చేసి బోవుటల్
సమ్మత మాయెనా - విడువ జాలితివా ! ఎటులై నిన్ను నే
పొమ్మన జాల చాలినను బొందిని ప్రాణము లుండనేర్చునే

అప్పుడు వీడ్కోలు సమయంలో గౌతముడు వచ్చి ఇంద్రుడ్ని అహల్యనూ శపిస్తాడు. దాంతో కథ కంచికి వెళ్తుంది. ఈ మధురమైన అహల్యా సంక్రందన ప్రబంధాన్ని సర్వాంగ సుందరంగా ప్రతి పద్య రమణీయంగా చతుర సంభాషణమయంగా తీర్చింది సముఖం వేంకట కృష్ణప్ప నాయుడు.

—o—